


***రచనాకాలం: 2000 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**విరించి పాతపాటే పాడటంతో చెప్పింది మానసి.**

"ఓ మానవా? పోస్ట్‌మెన్ కనపడ్డపుడల్లా ఉత్తరాలున్నాయా అని అడిగినట్లు నేను కనపడినప్పుడల్లా, ఓ ముద్దిస్తావా? అని అడగటం మానవా?"

"మానను. పోస్ట్‌మేన్ ఎన్ని రోజులు లేవన్నా మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్నని ఎలా అడుగుతామో, అలాగే ముద్దిచ్చేదాకా నిన్నది అడుగుతూనే వుంటాను."

"నీ ప్రశ్నకి నీకు విసుగు రావచ్చేమో కానీ నా జవాబుకి నాకు విసుగురాదు."

"నేనేమైనా పొగాకు నమిలేవాడ్నా లేదా సిగరెట్ తాగేవాడ్నా? పైగా రెగ్యులర్‌గా ఉదయం, రాత్రి టి.వి.లో టూత్‌పేస్ట్ ప్రకటనల్లోలా బ్రష్ చేసుకుంటాను కూడా. ఇస్తేపోలా?"

"చాలా కాలం నుంచి నాకో సందేహం - టూత్ అంటే?"

"పన్ను."

"టీత్ అంటే?" అడిగింది మానసి మళ్ళీ.

"పళ్ళు."

"మరే... టీత్ బ్రష్ అనకుండా టూత్ బ్రష్ అంటారేం?"

"దాన్ని కనిపెట్టిన వాడికి సింగ్లర్, ఫ్లూరల్స్ వచ్చి వుండవు కాని మాట మార్చకు. ప్లీజ్ గ్రాంట్‌మి ఒన్ సింగిల్ జెంటిల్ అండ్ స్మూత్ కిస్. విల్ యూ?"

"బేడ్ బ్రెత్ ముద్దుకి ప్రథమ విరోధి, ఒప్పుకుంటాను. కాని కిస్‌కి దానికన్నా ముందింకో ప్రథమ విరోధి వుంది."

"ఏమిటది?"

"దూరం. మానసికంగా దూరంగా వున్న వ్యక్తిని ముద్దుపెట్టుకోనివ్వడం అంటే మన ప్రయివసిని అతను ఇన్‌వేడ్ చేస్తుండటమే. అందుకని ఇంటిమసి ఏర్పడేదాకా నో కిసెస్ అంటారు అమ్మాయిలు."

"బట్ - నేను నీకు ఇంటిమేట్‌నే కదబ్బా?"

"ఆ ఇంటిమసి వేరు. మనసుకి దగ్గరితనం వచ్చేది ఒక్క పెళ్ళితోనే, ఒక్క భర్త దగ్గరే."

"అంటే ప్రపంచంలో అసలు వివాహేతర ముద్దులు లేవనేనా నీ వుద్దేశ్యం?"

"ఉన్నాయి. అయితే వాటిని అక్రమ సంబంధ ముద్దులు అనడం సబబు."

"ఇలా అయితే నిన్నేదోరోజు బలవంతంగా ముద్దు పెట్టుకోవాల్సి వుంటుందమ్మాయ్."

"ఇక్కడ ఎవరూ లేకపోతే ఎలాగో చూపించేవాడ్ని, పోలీసులు అరెస్ట్ చేస్తారని ఆగాను కాని."

"ఇలా వుంటే ముద్దు పెట్టుకోగలవా?" అడిగింది మానసి.

ఆమె తన నోటిని ఆవలిస్తూన్నట్లుగా తెరచి వుంచింది కాసేపు.

"ఊహూ" ఒప్పుకున్నాడు విరించి.

"ఇలా?"

ప్రశ్నించి ఈసారి నాలికని కాళికాదేవి విగ్రహంలోలా కింద గడ్డం మీదకి జాపింది.

"ఊహూ!"

"ఇలా?"

ఉమ్మును పెదవుల మీదకి తెచ్చుకుని అడిగింది.

"ఛీ! ఇలాంటి పాడు ఆలోచనలు నీకెలా వస్తాయసలు?" అడిగాడు.

"ముద్దు ఎలా పెట్టుకోవాలో మీ అబ్బాయిలకెలా తెలుసో, వాటిని టర్న్ ఆఫ్ చేయడం మా అమ్మాయిలకీ తెలుసు."

"చుడమ్మాయ్, పెళ్ళయ్యాక భర్త ఇచ్చే ముద్దులు టెంప్టేషన్‌తో కూడినవి కావు. అవి కేవలం ఆబ్లిగేషన్‌తో కూడినవి. అసలు ముద్దుని ఎంజాయ్ చేయాలనుకుంటే అవి పెళ్ళికి ముందు దొరికే పేషనేట్ ముద్దులద్వారానే. ఆనక నువ్వే చింతిస్తావ్."

"కిస్ అనేది ఇంకొకరిపట్ల వుండే ఫీలింగ్‌ని వ్యక్తం చేయడానికి ఉపయోగించేది. అయితే పెళ్ళయ్యాక భర్త ఆ ఫీలింగ్‌ని ముద్దుతోనే చెప్పాల్సిన పనుండదు. అందుకు ఇంకా ఎన్నో బెటర్ మెథడ్స్ వుంటాయి. కాబట్టి ముద్దు స్థానం మొదటిది కాదు కాబట్టి నువ్వనుకున్నట్లుగా నేను చింతించనుగాక చింతించను."

"నిన్ను ముద్దు పెట్టుకోవడం మొదలెడితే మన మధ్య రిలేషన్‌షిప్ ఇంకాస్త డెవలప్ అవచ్చని పాజిటివ్‌గా ఆలోచించరాదు?"

"నెగెటివ్ ఏస్పెక్ట్‌ని పాజిటివ్‌గా ఎలా ఆలోచించమంటావు? ఓ రచయిత ఓ నవల్లో రాసాడు. హీరోయిన్ అంటుంది హీరోతో. నా టూత్ బ్రష్‌ని వాడే ఇంటిమసి నాకొచ్చినప్పుడు నిన్ను ముద్దు పెట్టుకోనిస్తాను అని. ఈ రిలేషన్‌షిప్ అంటే అలా వుండాలి. అది నేను ఓ గూట్లో, నీవు ఇంకో గూట్లో వున్నంతకాలం కుదరదు. నా ఆబ్లిగేషన్స్ నావి. నీవి నీవి."

"పోనీ నీ బుగ్గని కొరకనిస్తావా?"

"పళ్ళు, ఒళ్ళు సరిగానే వున్నాయా?"

"శత్రువుని ముద్దుపెట్టుకోవడం కన్నా మిత్రుణ్ణి కొరకటం బెటరనే స్వీడిష్ సామెత ఒకటుంది. దాని ప్రకారం అడిగానంతే."

"చిరునవ్వు, కరచాలనం ఇవీ మనం ప్రస్తుతం వున్న స్టేజ్. ఇంకా నీవు కోరుకునే స్టేజ్‌కి చేరుకోలేదు మనం. ఆర్ రేదర్, నేను."

"అసలే వెధవ మొదట ఈ ముద్దుని కనుక్కున్నాడో" చిన్నగా నిట్టూర్చాడు విరించి.

"ఎవరంటే, నాలుగు పెదవులు, రెండు హృదయాలు, ఒక అనంతమయిన ప్రేమ, రొమాంటిక్ కిస్‌లోని భాగాలు అని నమ్మినవాడు."

"సర్లే, సర్లే"

"డోంట్ బి డిజప్పాయింటెడ్ ఓ అమ్మాయికి ముద్దు ప్రారంభానికి అంతానికి ఆరంభం. సో ఐ హేడ్ బెట్ బి కేర్ ఫుల్."

"వారానికి కొన్ని ముద్దులే అన్నాగా?"

"ఆ తర్వాత శోభనం గదిలో మావారిని ముద్దుపెట్టుకోవడం నాకు చేతకాదు."

"ఆ విషయంలో నీకు అనుభవం వచ్చేదాకా నా మీద ప్రాక్టీస్ చేసుకోనిస్తాగా. అదీగాక ఇదివరకు పెళ్ళయ్యాక ముద్దు మొదలవుతే ఇప్పుడు ముద్దులతో పెళ్ళి అవుతుంది తెలుసా?"

"ఇంక ఇంతటితో ముద్దు సమాచారం సమాప్తం. ఇంకేదయినా మాట్లాడు."

"పోనీ నీ చెవిలో ఓ రహస్యం చెప్పనిస్తావా?"

"సరే అంటే తర్వాత 'ముద్దు పెట్టుకోలేదు. నీ చెవిలో రహస్యం చెప్పానంతే' అంటావు. దొంగముద్దులు గురించి నాకు తెలీదా? ఇక ఈ టాపిక్ బంద్ అన్నాగా.. నీ అమెరికా ప్రయాణం గురించి మాట్లాడు."

గోపీనాథ్ బంధువు సుబ్రహ్మణ్యం ఫోన్ చేసి అమెరికానుంచి హీరాలాల్ కెమికల్స్ పేర లెటర్ పోస్ట్‌లో వచ్చిందని చెప్పాక గోపీనాథ్ ఆయనింటికెళ్ళాడు.

"ఈ కంపెనీకి ఎడ్రస్ లేదా మా యింటికి వచ్చింది?" అడిగాడాయన.

"లేదు. అసలా కంపెనీనే లేదు."

"ఎందుకు? ఈ లెటర్‌లో ఏం వుంది?" అడిగారాయన ఆసక్తిగా.

"మర్చిపోయినట్లున్నారు. మా తమ్ముడు అమెరికా వెళ్ళే ప్రయత్నాల కోసమని చెప్పానండి."

"అవునవును."

"వీసా ప్రయాసల కోసమని చెప్పావుకదూ? నిజమే. మర్చిపోయాను."

"ఇంకో లెటర్ కూడా వస్తుంది. అదే ఆఖరి లెటర్ అవుతుంది."

"వస్తే చెప్తాను".

గోపీనాథ్ ఆ రాత్రి పన్నెండున్నరకి ఫేక్స్ ఎస్.టి.డి సౌకర్యాలు వున్న ఓ బూత్‌కి వెళ్ళి అమెరికాలో సునీతకి ఆఫీస్‌కి ఇంటర్నేషనల్ కాల్ చేసాడు.

"హాయ్, వాట్ కెన్ ఐడూ ఫర్ యూ?" వినిపించిందో కంఠం అమెరికన్ ఏక్సెంట్‌లో.

"దిసీజ్ లాంగ్ డిస్టెన్స్ కాల్ ఫ్రం ఇండియా. కెన్ ఐ స్పీక్ టు మిసెస్ సునీత?"

"ఓ.... ష్యూర్. వెయిట్ ఎ సెక్."

కొద్దిక్షణాల తర్వాత సునీత కంఠం వినిపించింది.

"హలో గోపీ! హౌ ఆర్ యూ?"

"ఫైన్. పిల్లలెలా వున్నారు? మీవారికి వాళ్ళు బాగా ఎడ్జస్ట్ అయారా?"

"ఓ. బాగా ఎడ్జస్ట్ అయ్యారు. నువ్వెలా వున్నావు? ఆ లెటరేదో పోస్ట్ చేసాను. అందిందా?"

"అందింది. ఓ పావుగంటలో నేనో ఫేక్స్ మెసేజ్ యిస్తాను. మీ పర్చేజ్ వైస్ ప్రెసిడెంట్‌కి తెలీకుండా నాకు అందులోని నా ఫేక్స్ నంబరుకి జవాబు రేపటిలోగా ఇవ్వగలవా?"

"నీవు ఇ-మెయిల్‌లో రాసిన మేటరేనా?"

"అవును."

"ఓకే.."

"మీ వైస్ ప్రెసిడెంట్ చూడకూడౌ జాగ్రత్త."

"చూడాలంటే వాటిని నేనే ఆయన టేబుల్ దగ్గరికి తీసుకెళ్ళాలి. ఫేక్స్‌లు చూసేది నేనే."

"ఓకే."

"అరగంటలో పంపు. రేపట్లోగా వీలున్నప్పుడు ఆ జవాబు ఫేక్స్ చేస్తాను."

"వెరీగుడ్ సునీత. ఐయాం వెరీ గ్రేట్ ఫుల్ టు యూ."

"సో ఏమ్ ఐ. నా జీవితంలోని క్రూషియల్ పాయింట్‌లో నన్ను ఆదుకుంది నువ్వేగా. ఐ ఓ ఇట్ యూ మేన్."

"థాంక్స్. బైబై."

"బైబై."

ఫోన్ పెట్టేసాక గోపీనాథ్ అమెరికాలోని క్యాంటమ్ కెమికల్స్ ఇన్ కార్పొరేషన్‌లోని వైస్ ప్రెసిడెంట్, పర్చేజెస్ ఫేక్స్ నంబరుకి ఓ లెటర్‌ని పంపమని ఇచ్చాడు. బూత్ యజమానికి.

గోపీనాథ్ ముద్రించిన దొంగ లెటర్ హెడ్ మీద డి.టి.పి చేసిన ఆ లెటర్ ఫేక్స్‌ద్వారా వెంటనే వెళ్ళిపోయింది.

పైకం చెల్లించాక అడిగాడు గోపీనాథ్ అతన్ని.

"నే చెప్పింది గుర్తుందిగా?"

"ఉంది సార్. హీరాలాల్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేర అమెరికానించి ఫేక్స్ మెసేజ్ వస్తే జాగ్రత్త చేయాలి. నేను ఆ సంగతి ఫోన్ చేయగానే మీరొచ్చి తీసుకుంటారు."

"చాలా ముఖ్యమయిన లెటర్ అది. మిస్ ప్లేస్ చేయకండి."

"అలాగే సార్"

ఆ ఫేక్స్ వస్తే విరించికి పాస్‌పోర్ట్ మీద వీసాముద్ర పడినట్లే అనుకున్నాడు.

అంతా తను అనుకున్నట్లుగానే జరుగుతుండటంతో హుషారుగా ఈల వేస్తూ స్కూటర్ ఎక్కి స్టార్ట్ చేసాడు గోపీనాథ్.

"ఇది రాత్రికదా! అక్కడ అమెరికాలో పగలు. ఈపాటికి ఆఫీసులో వున్న అమెరికన్ ఐ.ఎన్.ఎస్ అధికారుల్లో ఎవరికీ తెలియదు తామెలా మోసపోతున్నామో" అనుకున్నాడు గోపీనాథ్ మనసులో.

అతను ఎంతో గర్వంగా ఫీలయ్యాడు తన మేధాశక్తికి.

## 10

చేతి గడియారం వంక చూసుకున్నాడు విరించి. రాత్రి పదకొండు ముప్పై అయిదు. సినిమా థియేటర్‌లోంచి బయటకి వచ్చి స్కూటర్ స్టాండ్ దగ్గరికి నడిచాడు. ఓ ఇంగ్లీష్ సినిమా చూసిన విరించి స్కూటర్‌ని స్టార్ట్ చేసి పోనిచ్చాడు.

మరో పదినిముషాల్లో అతని స్కూటర్ నెక్లెస్ రోడ్‌లోకి వచ్చింది. దాదాపు నిర్మానుష్యంగా వుందా రోడ్డు. సంజీవయ్య పార్క్ దాటి అతని స్కూటర్ అరకిలోమీటరు వెళ్ళాక దూరంగా ఓ జీప్ ఆగి వుండటం గమనించాడు. అతని స్కూటర్ జీప్‌ని సమీపించాక చూసాడు రోడ్డుకి అడ్డంగా వున్న రాళ్ళు. స్లోచేసి స్కూటర్‌ని ఆపాడు. జీప్‌లోంచి నలుగురు దిగారు. ఏం చెయ్యాలో అందరికీ విషయం తెలుసన్నట్లుగా విరించి స్కూటర్‌ని ఎత్తి తీసుకెళ్ళి ఎడమ పక్కనున్న హుస్సేన్ సాగర్ నీళ్ళలోకి విసిరేసారు. విరించి కూడా జాగ్రత్తగా బండరాళ్ళ పక్కనించి నీళ్ళలోకి దిగి నాలుగైదుసార్లు మునిగిలేచాడు.

వాళ్ళలో ఒకరు ఓ సెల్‌ఫోన్ కి తమ సెల్ నుంచి చేసి చెప్పాడు.

"డన్."

వెంటనే ఆ సెల్‌ఫోన్ కాల్‌ని రిసీవ్ చేసుకున్న గోపీనాథ్ తన సెల్ ఫోన్ నించి ఫోన్ నంబరు 100కి ఫోన్ చేసి చెప్పాడు.

"సంజీవయ్య పార్క్ దగ్గరనించి నేను వెళ్తుంటే, స్కూటర్ మీద వస్తున్న ఒకతన్ని నలుగురు ఎటాక్ చేస్తూ కనిపించారు. అతను ఆపదలో పడ్డాడని మీకు ఇన్‌ఫాం చేస్తున్నాను."

"మీ పేరు?"

"ఏదో వొకటి రాసుకోండి."

లైన్ కట్ చేసేసాడు గోపినాథ్. ఆ కాల్ రిసీవ్ చేసుకున్న కంట్రోల్ రూములోని పోలీసు ఉద్యోగి సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కి వైర్‌లెస్‌లో ఆ విషయం చెప్పాడు. ఆ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ స్కూటర్ మీద ఇద్దరు కానిస్టేబుల్స్‌ని పంపించాడు ఐ నిజమో, కాదో చూసి రమ్మని.

వాళ్ళకి రోడ్డుమీద నడిచి వస్తున్న విరించి ఎదురుపడ్డాడు. అతన్ని పిలిచి అడిగారు వాళ్ళు.

"ఎవరు నీవు? ఎక్కడ్నించి వస్తున్నావు? "

"నలుగురు రౌడీలు నన్ను చంపాలనుకున్నారు. నా స్కూటర్‌ని నీళ్ళలో పడేసారు" చెప్పాడు విరించి.

"నీ పేరు?"

"విరించి."

"ఎక్కడ్నించి వస్తున్నావు?"

"ఆనంద్ సినిమా హాల్ నించి."

"ఏం చేస్తుంటావు?"

"నిరుద్యోగిని."

పూర్తిగా తడిసి వున్న అతన్ని పరకాయించి చూసి అడిగాడో కానిస్టేబుల్.

"నువ్వెలా తప్పించుకున్నావు?"

"ఈది. నేను నీళ్ళల్లోకి పడ్డాక తుపాకి కాల్చారు. కానీ అదృష్టవశాత్తు నాకు తగల్లేదు గుళ్ళు."

"పద. ఎక్కడో చూపించు."

విరించి తన స్కూటర్ నీళ్ళలో పడ్డచోటు చూపించాడు.

"మునిగిపోయింది. బయటకి కనపడటంలేదు."

అంతా సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు. సి.ఐ. అడిగాడు విరించిని.

"నిన్ను చంపాలనుకున్న ఆ నలుగురు నీకు తెలుసా?"

"తెలీదు."

"వాళ్ళని గుర్తుపడతావా?"

"పడతాను. ఇదివరకు కూడా నన్ను చంపాలనుకుని చూసారు."

రివాల్వర్ కోసం అప్లై చేయడం, పోలీస్ ప్రొటెక్షన్ కోరడంలాంటి పాత విషయాలు సూక్ష్మంగా చెప్పాడు.

సి.ఐ, ఎస్.ఐ నలుగురు కానిస్టేబుల్స్‌ని తీసుకుని వెళ్ళారు. జీప్‌లో తాళ్ళు కూడా వేసుకున్నారు. స్కూటర్‌ని వెదికి అరగంటలో ఈత తెలిసిన ఆ కానిస్టేబుల్స్ బయటికి తీసారు. అది బయట పడగానే వైర్‌లెస్‌లో ఎ.సి.పికి ఆ సమాచారం పంపాడు సి.ఐ. ఆయన

కూడా వచ్చి సీన్ ఆఫ్ క్రయింని పరిశీలించాడు. జీప్ నంబరు చూసారా అని ఆయన కూడా అడిగిన ప్రశ్నకి లేదనే జవాబిచ్చాడు విరించి.

ఆ సంఘటన మీద ఎఫ్.ఐ.ఆర్‌ని తెరిచారు. మర్నాడు ఆ వార్త అన్ని దినపత్రికల్లో వచ్చింది. విరించి మీద అది నాలుగో హత్యాప్రయత్నం అని అన్ని దినపత్రికలు రాసాయి.

ఆటోమేటిక్‌గా ఆ వార్త క్లిప్పింగ్స్‌ని కూడా గోపీనాథ్ ఎవిడెన్స్ ఫైల్‌లో జాగ్రత్తచేసాడు.

"అలా కూర్చో" చెప్పాడు అరుణాచలం గోపీనాథ్‌తో.

అతను కూర్చున్నాక అడిగాడు.

"ఇలా పోలీసులు, కేసులు ఇంకా ఎంతకాలం?" ప్రశ్నించాడాయన.

"అదంతా అయిపోయింది నాన్నా.."

"నాకు ఎంత ఇబ్బందిగా వుందో తెలుసా? ఎంతమంది అడుగుతున్నారు విరించి గురించి. ఏం జవాబు చెప్పాలో తెలీక మొహం చెల్లడం లేదు నాకు. పైగా ఒక్కొక్కరు ఒక్కో వ్యాఖ్యానం చేస్తున్నారు."

"ఇంక ఇలాంటివి జరగవు నాన్నా. అదంతా అయిపోయింది."

"ఇల్లీగల్‌గా ఎంతమంది అమెరికాలో లేరు? మా బాబాయ్ అల్లుడి తమ్ముడు తొమ్మిదేళ్ళుగా అలా వుంటున్నాడక్కడ. కెనడా వెళ్ళి వీసా తీసుకుని మళ్ళీ అమెరికాకి వెళ్తుంటాడట."

"అది 1996కి మునుపటి మాట నాన్న. ఇప్పుడా పప్పులేం వుడకవ్."

"అదేం?"

"నైన్టీన్ నైన్టీ సిక్స్‌లో కొత్త ఇమిగ్రేషన్ చట్టం అమెరికాలో వచ్చింది. అంతకు మునుపు అమెరికాకి ఓ రోజు నాన్ ఇమిగ్రేషన్ వీసాతో వెళ్ళి ఆర్నెల్లుండి, ఇంకో రోజులో వీసా గడువు ముగ్గుస్తుందనగా, పక్కనే వున్న కెనడాకో, అమెరికాకో వెళ్తారు. అక్కడ అమెరికన్ కన్సలేట్‌లో నాన్ ఇమిగ్రెంట్ వీసా కోసం అప్లై చేసి అది వచ్చాక మళ్ళీ అమెరికాకి తిరిగి వెళ్తారు. అలా ఆర్నెల్లకోసారి పక్కదేశానికి వెళ్ళి వీసాని ఎక్స్‌టెండ్ చేసుకుంటూ నాన్ ఇమిగ్రెంట్స్ అమెరికాలో లీగల్‌గా కంటిన్యూ అవుతుండేవారు. కానీ ఈ సౌకర్యాన్ని కొత్త చట్టం రద్దుచేసింది. ఏ వీసా అయినాసరే అతను పుట్టిన దేశంలోని అమెరికన్ కన్సులేట్‌లోనే తీసుకోవాలన్న కొత్తనియమం ప్రవేశపెట్టారు.

దాంతో కొన్ని ఏళ్ళుగా అమెరికాలో శ్వాశతంగా నివసించే నాన్ ఇమిగ్రెంట్స్ తిరిగి స్వదేశానికి వెళ్ళడానికి ఇష్టపడక అమెరికాలో ఇల్లీగల్‌గా కంటిన్యూ అవుతున్నారు. ఒక్క ఇండియానించేకాదు - ఫిలిప్పీన్స్, కొరియా, థాయ్‌లాండ్ లాంటి అనేక దేశాలనుంచీ వచ్చిన వారందరికీ ఈ చట్టం పెద్ద దెబ్బ. ఏడేళ్ళ మల్టిపుల్ నాన్ ఇమిగ్రెంట్ వీసా వున్నవాళ్ళంతా ఈ చట్టంతో ఒక్కసారిగా ఇల్లీగల్‌గా మారిపోయారు."

"అందుకనేనా గ్రీన్ కార్డు వచ్చేదాకా ఇండియాకి రావడం కుదరదని నాలుగేళ్ళుగా రాలేదతను."

"అవును. అమెరికాకి వలస వెళ్ళలేని అనేకమంది అనేక విధాలుగా ఇమిగ్రెంట్ వీసా కోసం ప్రయత్నాలు చేస్తుంటారు. అమెరికా పక్కనే వున్న మెక్సికో బీదదేశం. మెక్సికన్ బార్డర్ దాటి రహస్యంగా అమెరికాలోకి చొరబడి ఇల్లీగల్‌గా కంటిన్యూ అవుతుంటారు. వాళ్ళ భార్యలు గర్భవతులయ్యాక కాన్పుకి ముందు అమెరికాలోకి ఈ విధంగా ఎంటరై అక్కడ కంటారు. అమెరికాలో డెలివరి అయితే ఆ బిడ్డకి సహజంగా అమెరికన్ పౌరసత్వం వస్తుంది. ఆ బిడ్డకి అలా అమెరికన్ పాస్‌పోర్ట్‌ని సంపాదించాక, ఆ బిడ్డ తన తల్లిదండ్రులని అమెరికాకి

రావడానికి స్పాన్సర్ చేయచ్చు. వాళ్ళ చట్టంలోని ఈ లూప్‌హోల్స్‌ని కూడా నైన్టీసిక్స్ ఇమ్మిగ్రేషన్ ఏక్ట్ నిరోధించింది. ఆ బిడ్డ మేజర్ అయి తన తల్లిదండ్రులని పోషించుకునే శక్తి వస్తేకానీ తల్లిదండ్రులని స్పాన్సర్ చేయలేరు.

"అంతా ఇలా ఎందుకు అమెరికాకి ఎగబడతారు?" అడిగింది మాలతి. "చెపితే అర్థంకాదు. వెళ్ళి చూస్తే తెలుస్తుంది. ఉద్యోగావకాశాలేకాదు. క్వాలిటీ ఆఫ్ లివింగ్. నిత్యజీవితంలో ఎలాంటి సమస్యలుండవు. ప్రశాంతమైన జీవితం, ఒకర్ని మరొకరు పట్టించుకోకపోవడం. వాళ్ళనించి మనం ఎన్నో నేర్చుకోవాలి."

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**